
# కొనసాగుతున్న జిఐఎస్ సర్వే


**-ఇప్పటివరకు 11లక్షల ఆస్తుల వివరాలు గుర్తింపు**
**-ప్రాపర్టీ టాక్స్ చెల్లించని ఆస్తులు 6లక్షల పైమాటే**
**-వీటినుంచి దాదాపు రూ.500కోట్లు వస్తాయని అంచనాలు**



**హైదరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:** గ్రేటర్ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి పనులతో పాటు అత్యవసర సేవలందించే జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ప్రాపర్టీ ట్యాక్స్ పెంచుకుండానే ఏటా వచ్చే ట్యాక్స్ కలెక్షన్‌ను పెంచుకునేందుకు జీహెచ్ఎంసీ ఏడాది క్రితం చేపట్టిన జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సర్వేను ప్రారంభించిన సంగతి తెల్సిందే. గత సంవత్సరం జూలై మాసంలో ఈ సర్వేను ప్రారంభించిన నియోజియో సంస్థ ఇప్పటి వరకు సుమారు 11 లక్షల ఆస్తులపై సర్వే నిర్వహించినట్లు సమాచారం. జీహెచ్ఎంసీకి సిటీలోని సుమారు 19.5 లక్షల ఆస్తుల నుంచి ట్యాక్స్ కలెక్షన్ వస్తుంది. వీటిలో దాదాపు రెండున్నర లక్షల ఆస్తులు కమర్షియల్ ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు నియోజియో సంస్థ సుమారు పదకొండు లక్షల ఆస్తులపై సర్వే ముగించగా, వీటిలో రెండున్నర లక్షల వరకున్న కమర్షియల్ ప్రాపర్టీల సర్వేను పూర్తి చేసింది. సర్వే ముగించేందుకు ముందుగానే చేసుకున్న ఒప్పందం ప్రకారం వచ్చే జనవరి మాసంలోపు ఈ సర్వేను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సర్వే పూర్తి చేసిన పదకొండు లక్షల ఆస్తులపై చేసిన సర్వేలో భాగంగా రెసిడెన్షియల్, కమర్షియల్ ఆస్తులు కలిపి దాదాపు 6 లక్షల ఆస్తులు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు పరిధిలో లేనట్టు అధికారులు గుర్తించారు. ఒక్కో ఆస్తిపై నిర్మించిన అంతస్తులు, తీసుకున్న అనుమతులు, యూసేజీ వంటి ప్రామాణికాల ప్రాతిపాదికన ఈ సర్వేను నిర్వహించినట్లు సమాచారం. సర్వేలో భాగంగా ట్యాక్స్ చెల్లింపు పరిధిలోకి రాకుండా ఉన్న ఆస్తుల్లో ఎక్కువ మెయిన్ రోడ్లకు ఇరవైపులా ఉన్న ఆస్తులు, వీటిలో కమర్షియల్ ఆస్తులే ఎక్కువగా ఉన్నట్లు సర్వేలో భాగంగా అధికారులు గుర్తించారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం చివర్లోనే ఈ ఆస్తులకు ప్రాపర్టీ ట్యాక్స్ వర్తింపజేసి, ఆ ఆస్తుల నుంచి కనీసం రూ. 500 కోట్ల నుంచి రూ. 600 కోట్ల వరకు ట్యాక్స్ వసూలు చేసుకోవాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ అధికారులున్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం (2025-26)లో వచ్చే మార్చి కల్లా సుమారు రూ. 2500 కోట్ల ట్యాక్స్ వసూలు చేసుకోవాలన్న లక్ష్యంతో ఉన్న జీహెచ్ఎంసీ ఇప్పటి వరకు రూ. 1100 కోట్ల ట్యాక్స్ ను వసూలు చేసుకుంది. లక్ష్యానికి మిగిలిన రూ. 1400 కోట్లను వసూలు చేసుకునేందుకు వీలుగా అధికారులు సిబ్బందిని ఉరుకులు, పరుగులు పెట్టించేందుకు స్కెచ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

**కాస్త ముందుగానే టార్గెట్లు..**

సాధారణంగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లకు సంబంధించి ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసం తర్వాత కలెక్షన్ పై ట్యాక్స్ సిబ్బంది, అధికారులు దృష్టి సారించే వారు. కానీ ఈ సారి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కాస్త ముందుగానే సిటీలోని 300 పై చిలుకు ప్రాపర్టీ ట్యాక్స్ డాకెట్లకు కాస్త ముందుగానే టార్గెట్లు ఫిక్స్ చేశారు. గత ఆర్థిక సంవత్సరం వసూలైన ట్యాక్స్ కలెక్షన్‌ను పరిగణలోకి తీసుకుని, దానికి 20 శాతాన్ని పెంచి సిబ్బందికి టార్గెట్లు ఇచ్చినట్లు సమాచారం. ప్రతి నెల 30 సర్కిళ్లలో రూ.వంద కోట్లకు తగ్గకుండా కలెక్షన్ చేయాలని టార్గెట్లు ఫిక్స్ చేశారు. ప్రతి నెల జీహెచ్ఎంసీ పర్మినెంట్, ఔట్ సోర్స్ ఉద్యోగులతో పాటు రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించేందుకు అవసరమైన రూ. 135 కోట్లలో సింహ భాగం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ నుంచే సమకూర్చుకోవాలన్న లక్ష్యంతోనే అధికారులు నెలకు రూ. వంద కోట్ల ట్యాక్స్ కలెక్షన్ చేయాల్సిందేనని, లేని పక్షంలో జీతాల చెల్లింపులు కష్టతరంగా మారే అవకాశమున్నట్లు ఇప్పటికే ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు సూచించినట్లు తెలిసింది. ప్రతి సర్కిల్ లో ట్యాక్స్ చెల్లింపు పరిధిలోకి రాని ఆస్తులను గుర్తించి, వాటిని చెల్లింపు పరిధిలోకి తీసుకురావాలన్న టార్గెట్లు కూడా ఇచ్చారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్న రూ. 2500 కోట్లలో ఇప్పటి వరకు రూ. 1100 కోట్లు వసూలు కాగా, టార్గెట్ రీచ్ అయ్యేందుకు మిగిలిన రూ. 1400 కోట్లతో పాటు అదనంగా గుర్తించిన ఆస్తుల నుంచి జనవరి మాసం నుంచి మార్చి చివరి కల్లా రూ. 500 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసుకుని, మొత్తం రూ. 3 వేల కోట్ల కలెక్షన్ టార్గెట్ పూర్తి చేసుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.



హైదరాబాద్ వార్త

# వరద నిలవొద్దు..
# నాలాలు పొంగొద్దు

**-కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి**
**-ఆర్‌యూబీల వద్ద అప్రమత్తంగా ఉండాలి**
**-హైడ్రా కమిషనర్ రంగనాథ్**



ఆరాంఘర్‌లో ఫ్లైఓవర్ పరిసరాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:** భారీ వర్షాలు పడుతున్నందున హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు నిత్యం అప్రమత్తంగా ఉండాలని వరద ముంచెత్తే ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉండాలని వరద వచ్చినప్పుడు నాలాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని.. క్యాచ్‌పిట్స్ అన్నీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సిబ్బందికి సూచించారు. ఈమేరకు బుధవారం నగరంలో వరద నిలిచే రహదారులతో పాటు కాలువల్లో సిల్ట్ తొలగించే పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్, జీహెచ్ఎంసీ స్థానిక అధికారులతో ఆయా ప్రాంతాల్లో తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో కూడా మాట్లాడి.. వరద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యం గామియాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, ఆరాంఘర్ చౌరస్తా, కాటేదాన్ ప్రాంతాలతో పాటు రాజ్‌భవన్ మార్గాలలో నీట మునుగుతున్న రహదారులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. కొత్తగూడ చౌరస్తాలో ఇటీవల వరద నీరు నిలిచిన ఆర్ యూ బీ వద్ద తీసుకున్న చర్యలను పర్యవేక్షించారు. అక్కడ ఆటోమేటిక్ డీ వాటరింగ్ పంపులు పని చేయకపోవడంతో గత శనివారం నీరు నిలిచిందని.. ఇప్పుడా ఇబ్బంది లేదని తెలిపారు. అవి పని చేస్తున్నా.. యిక్కడ హైడ్రా పంపులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం ప్రదర్శించ వద్దన్నారు. గచ్చిబౌలిలోని ఇంద్రా కాలనీలోని లోతట్టు ప్రాంతమైన గమన్ ఆసుపత్రి చేరువలో భారీ ఎత్తున నీరు నిలవడానికి గల కారణాలను పరిశీలించారు.నడుము లోతు నీళ్లు నిలిచ పోయి రాకపోకలు బంద్ అయినట్టు సమాచారం అందగానే హైడ్రా సిబ్బంది ఇంజిన్లు పెట్టి నీటిని బయటకు పంపారు. అక్కడ కాలువను కబ్జా చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని.. వెంటనే కాలువ విస్తరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**కాలువను వెంటనే విస్తరించాలి....**

సోమవారం భారీ వర్షం కురవడంతో ఆరాంఘర్ చౌరస్తా వద్ద నీరు నిలిచిన ఆర్‌యూబీని కమిషనర్ పరిశీలించారు. అక్కడ నేచురల్‌గా ఉన్న వరద కాలువ సామర్థ్యం సరిపోకపోవడతో ఇబ్బంది తలెత్తింది. ఇక్కడ మోటార్లను ఏర్పాటు చేసి నీటిని ఎప్పటికప్పుడు తోడాలని సూచించారు. అలాగే జూపార్కుకు వెళ్లే వంతెన కింద కాటేదాన్ ప్రాంతంలో పైనుంచి వచ్చే వరద నీటికి సరిపడా కాలువ లేకపోవడంతో ఆ ప్రాంతం నీట మునిగిందని.. వెంటనే ఊర చెరువు వరకూ కాలువను విస్తరించాలని అధికారులను ఆదేశించారు. బయోడైవర్సిటీ వద్ద వరద నీరు పోటెత్తే ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ తో కలిసి పరిశీలించారు. వంతెనల మీద కూడా నీరు పోయే రంధ్రాల్లో మట్టి చేరకుండా కూడా చూడాలన్నారు. నగరంలోని వరద ముప్పు ఉన్న ప్రధాన రహదారుల వద్ద నిరంతరం సేవలందించే స్టాటిక్ టీమ్‌లు ట్రాఫిక్ పోలీసులకు అందుబాటులో ఉండాలని కమిషనర్ రంగనాథ్ సూచించారు. వరద నీరు నిలవకుండా తీసుకునే చర్యల్లో ఇక్కడి స్టాటిక్ టీమ్‌కు చెందిన వారితో పాటు.. హైడ్రా డీఆర్ ఎఫ్, ఎంఈటీ టీమ్‌లకు మార్గదర్శకం చేయాలన్నారు. రహదారులపై నీరు నిలవకుండా చూస్తే ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తదన్నారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు.. హైడ్రా అధికారులు పాపయ్య,అశోక్, శ్రీకాంత్ ఉన్నారు.

# అంతర్ రాష్ట్ర సెల్‌ఫోన్ల చోరీ ముఠా అరెస్టు

**- రూ.50 లక్షల విలువ చేసే 473 ఫోన్లు స్వాధీనం**
**- ఎపిలోనూ నేరాలకు పాల్పడిన నిందితులు**
**- రద్దీ ఉన్న బస్టాప్‌లు, మార్కెట్లే టార్గెట్**
**-నిందితుల్లో భార్య భర్తలు, పరారీలో ఒకరు**



చోరికి గురైన సెల్‌పోన్లను స్వాధీనం చేసుకున్న మహేశ్వరం జోన్ ఎస్ఓటి, మీర్‌పేట్ పోలీసులు

**సరూర్‌నగర్, జూలై 23 ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జనాల రద్దీని లక్ష్యంగా చేసుకొని చాకచక్యంగా మొబైల్ ఫోన్లను ఎత్తుకపోయే ఐదుగురు సభ్యులతో కూడిన అంతర్ రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్గురు అరెస్ట్ కాగా..ఒకరు పరారీలో ఉన్నారు. ఇందులో భార్యభర్తలు ఉండడం చూసి పోలీసులు విస్తుపోయారు. వీరి వద్ద నుండి ఏకంగా దాదాపు రూ.50 లక్షల విలువ చేసే వివిధ బ్రాండ్లకు చెందిన 473 సెల్‌ఫోన్లు ఉన్నాయి. మీర్‌పేట్ పోలీసులతో కలిసి మహేశ్వరం జోన్ ఎస్ఓటి బృందం సంయుక్తంగా దాడులు చేయడంతో చోరీ వెలుగుచూసింది. ధూల్‌పేట్‌కి చెందిన ఆటో డ్రైవర్ గారెడి మహేష్ అలియాస్ అమురి మహేష్ అలియాస్ కొడిచెర్ల జగన్ (33) మీర్‌పేట్ నందనవనంలో ఉంటాడు. లింగంపల్లి చెందిన జొమాటో డెలివరీ బాయ్ సల్లంగుల నరేష్ అలియాస్ ఆకుల నరేష్ అలియాస్ అరుకల నరేష్ (20) సరూర్‌నగర్ తపోవన్ కాలనీలో నివాసం ఉండగా.. మీర్‌పేట్ నందనవనం భూపేష్‌గుప్తా నగర్‌కు చెందిన నాగునూరి నాగమణి (28), నాగునూరి సాయికుమార్ (పరారిలో ఉన్న వ్యక్తి) దంపతులు, ఏపీకి చెందిన కారు డ్రైవర్ కుమ్మరి గోపి (32)లు ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బస్టాప్‌లు, మార్కెట్లు రద్దీ ప్రదేశాల్లో తచ్చాడుతూ సెల్‌ఫోన్లను ఎత్తుకపోతారు. ఈ ఫోన్లను అధిక రేటుకు అమ్ముకొని వచ్చిన డబ్బులను జల్సా చేస్తారని పోలీసులు తెలిపారు. విశ్వసనీయ మాచారంతో మీర్‌పేట్ ప్రగతినగర్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి సుమారు రూ.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదం....పలువురికి గాయాలు

**అత్తాపూర్ జూలై23, ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాబూల్ రెడ్డి నగర్‌లో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో సగం వరకు దూసుకెళ్లింది. స్వల్ప గాయాలతో ప్రయాణీకులు బయటపడ్డారు. వెంటనే క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు మృతి

**తార్నాక, జూలై 23 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఇంటెలిజెన్స్)గా పనిచేస్తున్న రంగినేని రాజేశ్వర్ రావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం తార్నాకలో బైక్‌పై వెళ్లుతుండగా బైక్ స్కిడ్ అయి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన ఎప్పుడూ నవ్వుతూ అందరితో స్నేహపూర్వకంగా మెలిగే వారి స్వభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వారు అందించిన సేవలు అపూర్వమైనవని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు.

## బోయిన్‌పల్లి మార్కెట్‌ను రైతు కమిషన్ కమిటీ సభ్యుల తనిఖీ



బోయిన్‌పల్లి మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న రైతు కమీషన్ ఛైర్మన్ కోదండరెడ్డి,మార్కెట్ ఛైర్మన్ ఆనంద్ బాబు తదితరులు

**కంటోన్మెంట్, జూలై 23 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బోయిన్‌పల్లి వ్యవసాయ మారె ్కట్‌ను తెలంగాణ రాష్ట్ర రైతు కమీషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ ఛైర్మన్ ఆనంద్ బాబు గౌడ్, రైతు కమీషన్ సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డిలు బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. మార్కెట్ కార్యదర్శి వెంకన్న అందుబాటులో లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయిన్‌పల్లి మార్కెట్‌లోని కూరగాయలపై రైతుల నుంచి కొనుగోలు, అమ్మకాలపై ఆరా తీశారు. వివిధ వివిధ కూరగాయల విక్రయాలు, కొనుగోలుపై రసీదులను పరిశీలించారు. అదే విధంగా అటెండెన్స్ రిజిస్టర్, మార్కెట్ రికార్డులు, ఫైళ్లను తనిఖీ చేశారు. కూరగాయల వ్యర్థాలతో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఎందుకు పనిచేయడం లేదని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమీషన్ అధికారులు మార్కెట్ కమీషన్ అధికారులు హరివెంకట ప్రసాద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేను కూడా సాధారణ పాఠశాల్లోనే చదివాను..!

**ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హాజరైన డిజిపి జితేందర్**



**హైదరాబాద్, జూలై23, ప్రభాతవార్త:** పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఏర్పాటైన ఉద్భవ్ పాఠశాల విజయవంతంగా కొనసాగాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆకాంక్షించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, అహ్మదాబాద్ పూ ర్వ విద్యార్థుల సం ఘం, హైదరాబాద్ చారిటబుల్ ట్రస్ట్(ఐఐఎం ఏ ఏ ఏ హెచ్సిటి) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫతేనగర్‌లో ఏర్పాటైన ఉద్భవ్ పాఠశాల క్యాంపస్‌ను బుధవారం రాష్ట్ర డిజిపి జితేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మురికివాడ ప్రాంతా లకు చెందిన బాల బాలికలకు విద్యనుఅందించాలని సదుద్దేశంతో ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఎల్‌కెజి నుండి పదవ తరగతి వరకునాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీసి వారికిచక్కటి భవిష్యత్తు ఇవ్వాలని సూచించారు. మేనేజ్‌మెంట్ పూర్వపు విద్యార్థులైన రిటైర్డ్ ఐపిఎస్‌లు ఎస్వి రమణమూర్తి, షణ్ముఖ, హరీష్ కుమార్, సీతారాం, శ్రీ హర్షలు బోర్డు ట్రస్టీలుగా ఉండడం గర్వకారణమన్నారు. జితేంద ర్ మాట్లాడుతూ విద్యను అభ్యసించడానికి పేద, గొప్ప తేడా ఉండవని అందరి లోనూ ప్రతిభ ఉంటుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ ను ఉపాధ్యాయు లు కనుగొని ప్రోత్సాహిస్తే ప్రతి విద్యార్థి ప్రయోజకులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫండ్ రైజింగ్ కమిటీ ఛైర్మన్ టి. మురళీధరన్, కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఆర్. రవి కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బోనాల ఉత్సావాల సందర్భంగా బోనం ఎత్తుకుని పూజకు బయల్దేరిన కలెక్టర్ హరిచందన దాసరి

# పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీపడొద్దు

**-శిశువిహార్‌లో ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలి**
**-అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**



శిశువిహార్‌లో భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ హరిచందన

**హైదరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:** పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ఎక్కడ కూడా రాజీ పడొద్దని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌ను జోనల్ కమిషనర్ హేమంత్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువిహార్ లో పిల్లలకు సమయానికి నాణ్యమైన పౌష్టికాహారం అందించటంతో పాటు ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ దశలవారీగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబద్ధత, బాధ్యతాయుతంగా ఉండాలని ఆమె సూచించారు. భవనం లోని గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే పరిసరాలలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలను సత్వరమే తొలగించి కిచెన్ గార్డుకు అనువుగా ఉన్న ప్రాంతాలలో ఆకుకూరలు పెంచాలని సూచించారు. పిల్లల సంఖ్య, దత్తత ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల వసతి గదులు, డైనింగ్, మెడికల్ గది, భవనం స్థితిగతులు, పిల్లలకు అందుతున్న వైద్యం తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే పిల్లలకు ఆట వస్తువులతో ఎక్కువగా ఆడుకునే విధంగా చూడాలని ముఖ్యంగా వ్యాధులు సోకకుండా వ్యక్తిగత పరిశుభ్రత తో ఉండేలా చూడాలని సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలకు అందించిన డ్రాయింగ్ బుక్స్, యూనిఫామ్స్ వివరాలను అలాగే అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. తదుపరి వంట గదిని పరిశీలించి ఆహార పదార్థాల రుచి చూసి నాణ్యతలో ఎక్కడ రాజీ పడకుండా నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డెడి మోతి, తహసిల్దార్ ప్రేమ్ కుమార్, ఇంచార్జ్ ఆఫీసర్ సంతోషి బాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు హెల్త్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి


**-మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**



కృష్ణకాంత్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ కార్మికులను హెల్త్ కిట్స్ పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్.

**యూసుఫ్‌గూడ, జూలై 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నిరకాల ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి అందివ్వటం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళ్‌రావునగర్ కృష్ణకాంత్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా మంత్రి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. పెద్దఎత్తున జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వారికి హెల్త్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దవాఖానాలకు పోకుండా ఎలాంటి పరీక్షలైనా ఈ వైద్య శిబిరంలో తీసేలా అవసరమైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని జిల్లా రెవెన్యూ, మున్సిపల్, మెడికల్ సిబ్బంది కలిసి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 169 బస్తీ దవాఖానాలు ఉన్నాయని 91 ప్రైమరీ హెల్త్ సెంటర్లు 11 స్పెషాలిటీ ఆస్పత్రులు దాదాపు 30 ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుందన్నారు. నిన్నటి వరకు బోనాల పండుగ జరిగాయని ప్రస్తుతం వాతావరణంలో మార్పువల్ల కొన్ని సీజనల్ అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పేదలకు అండగా ఉండటానికి ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని పేద ప్రజలకు తినటానికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని 10 సంవత్సరాల తర్వాత రేషన్ కార్డులు అందిస్తున్నామని 53 వేల రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలు చేయటం జరుగుతుందన్నారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లు మైలురాయి దాటుతుందని ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. గురుకులాలలో నాణ్యమైన ఆహారం అందించటానికి మెస్ ఛార్జీలు పెంచామన్నారు. చదువుకున్నవారికి దాదాపు 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు.

## ఫుడ్‌పాయిజన్ బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం జూలై.23.ప్రభాతవార్త**

గత రెండు రోజుల క్రితం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఆర్.టీ.సీ.కాలనీ నందు బోనాల పండుగకు తెచ్చుకున్న మాంసం తిని ఫుడ్ పాయిజన్ అయి ఆస్పత్రి పాలైన ఒక కుటుంబ సభ్యులను బుధవారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వారు చికిత్స పొందుతున్న హాస్పిటల్ వెళ్లి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ...పది మందిలో ఒకరు అయిన శ్రీనివాస్ గారు మృతి చెందడం చాలా బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు.బోనాల పండుగ సమయంలో తెచ్చుకున్న మాంసం చికెన్,బోటిని ఫ్రిడ్జిలో పెట్టి మరుసటి రోజు మాంసం తిన్న తర్వాత వాంతులు,విరోచనాలతో హాస్పిటల్ నందు చేరిక కావడం జరిగింది అని దానిలో భాగంగా ప్రస్తుతం ఏడు మంది ఆరోగ్యం నిలకడగా ఉండి ప్రస్తుతానికి కొలుకుంటున్నారు అని,మరో ఇద్దరి పరిస్థితి రెండు,మూడు రోజుల్లో మెరుగుపడుతుంది అని తెలిపారు.అందరూ త్వరగా కోలుకోవాలని కోరారు.ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు.అలాగే డీ.ఎం.హెచ్.ఓ.తో ఫోన్లో మాట్లాడి బాధితులకు తగు న్యాయం చేయాలని కోరారు.

## బాలగంగాధర్ తిలక్ ,చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



తిలక్,ఆజాద్‌లకు నివాళులర్పిస్తున్న వనిపల్లి.

**వనస్థలిపురం. జూలై.23.ప్రభాతవార్త**

ఎల్బీనగర్ నియోజకవర్గం మనసురాబాద్‌లోని బిజెపి జిల్లా కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విశేష సేవలందించిన అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ , లోకమాన్య తిలక్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు కొబ్బరికాయలు కొట్టి, పుష్పాంజలులు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వనిపల్లి శ్రీనివాస్ రెడ మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరసంతులు చంద్రశేఖర్ ఆజాద్ మరియు లోకమాన్య తిలక్ లాంటి మహనీయుల సేవలను మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, మహిళా నాయకులు చల్ల గీత రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్ రెడ్డి, శేర్లింగంపల్లి మహిళా మోర్చా నాయకురాలు నాగపరిమిల గారు తదితర నాయకులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



**నేరెడ్‌మెట్, జూలై 23:ప్రభాతవార్త :** మల్కాజిగిరి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ శ్రవణ్ నగరపాలక సంస్థ కమిషనర్ కర్ణన్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో రహదారి, డ్రైనేజ్, ఓపెన్ జిమ్ వంటి అంశాలపై వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించారు.విశేషంగా, విష్ణుపూరి ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో రైల్వే ట్రాక్ పక్కన డ్రైనేజ్ (నాలా) నిర్మాణం, పంచమి హోటల్ నుండి బజరంగ్ చౌరస్తా వరకు సీసీ రోడ్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. అలాగే బలరాం నగర్‌లో పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులకు కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ ప్రతిపాదనలపై స్పందించిన కమిషనర్ కర్ణన్, తక్షణమే జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు ఫోన్ చేసి సంబంధిత పనులను పరిశీలించి త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో చెంపాపేట్ కార్పొరేటర్ వంగ మధు, అంబర్‌పేట్ కార్పొరేటర్ యకరా అమృత పాల్గొన్నారు.ప్రజా అవసరాలపై దృష్టి పెట్టి మల్కాజిగిరిలో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శ్రవణ్ ముందంజ వేయడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఆర్‌యుబి,ఆర్‌ఓబి పనులు త్వరగా చేపట్టాలి



**మల్కాజిగిరి జూలై23,ప్రభాతవార్త :**

సికింద్రాబాద్ రైలు నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ ,వాత్సవ ని, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ ఆంజనేయ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ ఏ.హెచ్. మల్లికార్జున్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్గిరి నియోజకవర్గంలోని ఆర్‌యుబి మరియు ఆర్‌ఓబి పనులు త్వరగా చేపట్టాలని ప్రజలకు అందుబాటులోకి తేవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.అందుకుగాను రైల్వే జనరల్ మేనేజర్ గారురైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మురుగేష్, మేకల రాము యాదవ్, డోలి రమేష్, సురేందర్ రెడ్డి, శోభన్ బాబు, ప్రభాకర్, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్,నయీం, శ్రీకాంత్ సాయి ప్రసాద్, పాల్గొన్నారు .

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కలెక్టర్ హామీ

**-విద్యార్థుల అవసరాలను అధ్యయనం చేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్**

**- త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ**



**నేరెడ్‌మెట్ జూలై 23,ప్రభాతవార్త :**

మల్కాజిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మంగళవారం కళాశాలను సందర్శించారు. ఆయనతో పాటు అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్త కూడా పాల్గొన్నారు.కళాశాల ప్రాంగణంలో కలెక్టర్ విద్యార్థులతో అనౌపచారికంగా మాట్లాడి, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు వివిధ మౌలిక వసతుల పరిస్థితులపై వివరాలు అందించారు. ముఖ్యంగా తరగతి గదులు, శౌచాలయాల సమస్య, ప్రయోగశాలల లోపాలు, కంప్యూటర్ ల్యాబ్ అవసరం, తాగునీటి సదుపాయం, భవన విస్తరణకు స్థలాభావం వంటి అంశాలను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి స్పందిస్తూ, "సర్కారి విద్యా సంస్థలు సామాన్య విద్యార్థులకు ఆశాభద్రతగా నిలవాలి. కావున కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల కెరీర్‌కు తోడ్పడేలా కౌన్సిలింగ్, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తాం" అని హామీ ఇచ్చారు.ఈ సందర్శనలో కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం ఈ కళాశాల అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుంటుందన్న కలెక్టర్ వ్యాఖ్యలతో విద్యార్థుల్లో కొత్త ఆశలు వెలిసినట్లు కనిపించింది.

## భవిష్యత్తు తరాలకు కోసం మొక్కలు నాటాలి : ప్రిన్సిపల్ సుధాకర్




విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ నాచం సుధాకర్ తదితరులు

**మలక్ పేట,జూలై 23, ప్రభాతవార్త:** భవిష్యత్తు తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ హై స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ నాచం సుధాకర్ పేర్కొన్నారు. చాదర్ ఘాట్ ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ పాఠశాల ప్రిన్సిపాల్ నాచం సుధాకర్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయుల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత , వాటి ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాట్యం సుధాకర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. పర్యావరణాన్ని చక్కగా పరిరక్షించుకోవాలని, దీంతోనే మానవాళి మనుగడ ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ మిస్టర్స్ బిల్కిస్ ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ దేవాలయం అమ్మవారి ఘటాల ఊరేగింపు



పోతురాజుల విన్యాసాలు నడుమ అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు పి.టి శంకర్ ముదిరాజ్, కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,జూలై 23, ప్రభాతవార్త :** మలక్ పేట్ లోని ప్రముఖమైన శ్రీ పోచమ్మ దేవాలయం ఘటాల ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు నడుము అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం శ్రీ పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమై మున్సిపల్ కాలనీ, మటన్ మార్కెట్, పంచశీల లైబ్రరీ, అగ్రికల్చర్ ఆఫీస్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, శంకర్ నగర్, మహంకాళి దేవాలయం వద్ద అమ్మవారి ఘటం చేరుకుంది. అదేవిధంగా గంగోజి ద్వారా భవిష్యవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చింత చెట్టు మహంకాళి దేవాలయం నుంచి అమ్మవారి ఘటం సారె, గంపతో బయలుదేరి పాపయ్య బస్తీ మీదుగా వాహేద్ నగర్, జింకలగడ్డ వద్దకు చేరుకుని ఘటం, సారె గంప నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు పిటి శంకర్ ముదిరాజ్, తులసి సురేష్ కుమార్, కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, ముప్పిడి శ్రీనివాస్ లు మాట్లాడుతూ అమ్మవారి బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపు కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అమ్మవారు ఉత్సవాలను పురస్కరించుకుని సహకరించిన భక్తులకు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఘటం, సారె గంప, నిమజ్జనంతో ఈ కార్యక్రమం ముగియడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ ముదిరాజ్, వెంకటేష్, టిన్నుసింగ్, శశిధర్ యాదవ్, శ్రీనివాస్, కిషన్, రాజు, శ్రీధర్ ముదిరాజ్, ఘటం బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంప్రదాయ పండుగల్లో యువత భాగస్వాములు కావడం అభినందనీయం

**-మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



సిద్దాల దినేష్ నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో కళాకారుల బృందంతో సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో మాజీ ఎంపిపి సిద్దాల లావణ్య బీరప్ప



ఫలహారం బండిని ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 23 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో యువత భాగస్వాములు కావడం హర్షణీయమని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ 21 డివిజన్‌లో సరూర్‌నగర్ మాజీ ఎంపిపి, కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య, జిల్లెలగూడ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు సిద్దాల పెద్ద బీరప్ప కురుమల తనయుడైన యువ నాయకుడు సిద్దాల దినేష్ కురుమ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి గ్రామ దేవత ఫలహారం బండిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కళాకారుల బృందం విన్యాసాల అట్టహాసంగా సాగిన ఊరేగింపును వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పండుగల సంస్కృతి, సాంప్రదాయలను మరువకుండా వాటిని యువత కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా శాంతియుతంగా ఉత్సవాలను, ఊరేగింపులను జరపుకోవాలని సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లార్డ్స్ బీరప్ప, బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల పద్మ అంజయ్య, ఎనుగుల అనిల్ యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, మాదరి సురేఖ రమేష్, గడ్డమీది రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, జె.సౌందర్య విజయ్, జిల్లెలగూడ టెంపుల్ మాజీ ధర్మకర్త సుర్వి లత శేఖర్‌గౌడ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్, మలిదశ ఉద్యమకారుడు దయానంద్ ముదిరాజ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని నియమించాలి

**: వామపక్ష విద్యార్థి జెఎసి డిమాండ్**



విద్యా సంస్థలను బంద్ చేయిస్తున్న దాసరి అరవింద్ తదితరులు

**సరూర్‌నగర్, జూలై 23 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగ సమస్యల సత్వర పరిష్కారానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐడిఎస్ఓ, ఎఐఎస్‌బి, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐపిడిఎస్‌యులు ఐక్య కార్యాచరణ కమిటీ పేరిట ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో విద్యా సంస్థల బంద్ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లలో పర్యటించి విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, ప్రైవేటు, కార్పొరేటర్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న కాలేజీలు, పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని, విద్యార్థుల పెండింగ్ మెస్, కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాలాపూర్ మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు దాసరి అరవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మనోజ్, కిరణ్ నాయక్, సాయికుమార్, దుర్గా ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులు

**ఎల్.బి.నగర్, జూలై 23 ప్రభాతవార్త:** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ కార్యక్రమం విజయవంతం అయిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ తెలిపారు. ప్రభుత్వాలు మారిన నేటికీ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. కిటికీలు, ప్రహరీగోడలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బడుగు వర్గాలు చదివే ప్రభుత్వ విద్యా సంస్థలను గాలికి వదిలేసి, కార్పొరేట్ ప్రవేట్ విద్యా సంస్థలకుప్రభుత్వం పరోక్షంగా సహకారం అందిస్తుందని ఆరోపించారు. రూ.8500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ నేటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.

## ఒక సిసి కెమెరా వంద మందితో సమానం

**- ఏసిపి వెంకట్ రెడ్డి**



జువెలరీ షాపులో యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసిపి వెంకట్ రెడ్డి.

**కుషాయిగూడ, జూలై 23, ప్రభాతవార్త :**

ప్రతి జువెలరీ షాప్ ఉన్నవారు సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని కుషాయిగూడ అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బంగారు ఆభరణాల షాపుల యజమానులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీలను నియంత్రించడానికి నేరాల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్లు వెంకన్న శ్రీనివాస్ సతీష్ లతోపాటు స్వర్ణకార సంఘం జిహెచ్ఎంసి అధ్యక్షులు అందజే రామాచారి, వినోద్ కుమార్ చారి, చిన్నోజు వరప్రసాద్ సారి పాల్గొన్నారు.

## వర్షం నీరు రోడ్లపై నిలబడకుండా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 23 ప్రభాతవార్త:** వర్షం పడినప్పుడు వరదనీరు రోడ్లపై నిలబడకుండా సాఫీగా వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండడం వల్ల రోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడుతున్నాయని, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ పూజలు



దేవాదాయ శాఖ కమీషనర్ వెంకటేరావుతో దేవాలయ అర్చకులు, సిబ్బంది

**సైదాబాద్, జూలై 23 ప్రభాతవార్త:**

దేవాదాయ శాఖ కమీషనర్ వెంకటేరావు కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు కమీషనర్‌కు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

**నీటి పైపులైన్ పనులు ప్రారంభం..**

దేవాలయంలోని ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి దేవాలయంలోని వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా చేయడానికి పైపులైన్లు వేసే పనులను దాత సోమలింగం గౌడ్ సహకారంతో మంగళవారం ప్రారంభించారు.కార్యక్రమంలో అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.


## శ్రీ శివ సూర్యనారాయణ దేవాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న మధురఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 23 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశివ సూర్యనారాయణ దేవాలయం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళాన్ని మధురఉపేందర్‌రెడ్డి బుధవారం వాసవి కాలనీలోనే ఆయన నివాసంలో దేవాలయం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు వక్కలంక శ్రీనివాస్, జగని రామూర్తి, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు రక్షణ కిట్ పంపిణీ



రక్షణ కిట్ పంపిణీ చేస్తున్న సుజాత, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూలై 23 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్ లను సరూర్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పంపిణీ చేశారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంక్షేమం కోసం రక్షణకిట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఉదయం నుండి డివిజన్ మొత్తం పరిశుభ్రంగా ఉండటానికి కష్టపడుతున్న పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ చందన, సానిటరీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, జవాన్ వినోద్, సూపర్వైజర్లు ప్రేమ్, అఖిల్, శివ, బిజెపి డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్‌కుమార్, సుందర్‌నారాయణ, తోట మహేందర్‌యాదవ్, గట్టు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన తీసుకువస్తా

**: కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

**హయత్ నగర్, జూలై 23 ప్రభాతవార్త:**

డివిజన్ పరిధిలోని కాలనీలలో అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ఎన్ని నిధులనైనా తీసుకు వస్తానని మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హయత్ నగర్ ప్రాంతం వినాయక్ నగర్ కాలనీలో ఇటీవల చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పునరుద్ధరణ పనులతో పాడైన రోడ్డుకు మారమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరడంతో స్పందించిన ఆయన షార్ట్ టెండర్ తో సి.సి రోడ్ అభివృద్ధి పనులకు 14 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం కారణంగా రోడ్డు మీద గుంతలు పడి నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. పోచమ్మ గుడికి బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులు కూడా ఇబ్బంది పడతారని తెలిపారు. దీంతో వస్తుంటారని సమస్యను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారానికి నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. సరైన లెవెల్స్ పాటిస్తూ, రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న ర్యాంపులు, చెట్లు పెట్టే గోడలను తొలగించి రోడ్డు నిర్మించాలని, అతి త్వరలో రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ సప్న, కాలనీ వాసులు రమణారెడ్డి, కొండల్ రెడ్డి, వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, భాను గౌడ్, సురేష్, సోమిరెడ్డి, పాల్గొన్నారు.

## ఎస్సి ,ఎస్టి ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం



చెంగిచెర్ల బస్ డిపో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో పాల్గొన్న కుర్రి శివశంకర్, రాష్ట్ర, జోనల్ రీజినల్ నాయకులు

**బోడుప్పల్, జూలై 23 ప్రభాతవార్త ;** చెంగిచెర్ల బస్ డిపో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కుర్రి శివశంకర్ ఆధ్వర్యంలో డిపో కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో డిపో సెక్రటరీ సాయప్ప, ప్రెసిడెంట్. శ్రీనివాస్. కోశాధికారి. రాథోడ్ నాయక్. రాష్ట్ర, జోనల్, రీజినల్ నాయకులు,చెంగిచెర్ల బస్ డిపో డ్రైవర్లు సలిగంజి చంద్రయ్య కే బీ నరసింహ్మా పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలకు బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలి : శంకర్‌రెడ్డి



రామచందర్‌రావును సన్మానిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి రథ సారథి ఎన్.రామచందర్‌రావు నాయకత్వంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర బిజెపి నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రామచందర్‌రావును బుధవారం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థలకు పార్టీ క్యాడర్ సిద్ధం అవుతున్నదని వెల్లడించారు. సమన్వయంతో సంఘటితంగా పని చేసి వచ్చే ప్రతి ఎన్నికలో బిజెపి పతాకాలను ఎగురవేయడానికి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ పార్టీ నాయకులు రామిడి మహేందర్‌రెడ్డి, నరేంద్రచారి, రామిడి శేఖర్‌రెడ్డిలతో పాటు పి.నరేష్, నవీన్‌కుమార్, లోకేష్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే ప్రజల వద్దకే పాలన

**-కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి గౌడ్**



స్థానిక సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులకు వివరిస్తున్న కప్పర సాయి కిరణ్ గౌడ్

**నాచారం, జూలై 23 ప్రభాతవార్త :** వర్షలలతో లోతట్టు ప్రాంతాల ఇళ్ళలోకి నీరు వస్తున్న సమస్య లను బుధవారం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో పాటు కాలనీ లు సదర్శించారు. అదేవిదంగా మంజూరైనా పనులను తొందరగా పూర్తి చేయాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో కాప్రా ఏసీపి కృష్ణ మోహన్, డీఈ రూప,ఏఈ స్రవంతి, వాటర్ వర్క్ మేనేజర్ సిరాజ్ , కాలనీ అధ్యక్షులు విజయ్, అల్తాఫ్, మురళి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జూలై 23 ప్రభాతవార్త :** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను జోనల్ కార్యాలయంలో కలిసి చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పాత్రాన్ని అందజేశారు. చిల్కానగర్ డివిజన్లోని యాదగిరి రేషన్ షాప్ ఎదురుగా ఉన్న వీధిలో స్ట్రాం వాటర్ డ్రైన్స్, సిసి రోడ్ల కొరకు, సాయిరాం నగర్ కాలనీలో, శ్రీనగర్ కాలనీ మరియు ధర్మపురి కాలనీ, రాఘవేందర్ నగర్ కాలనీలో స్ట్రాం వాటర్ డ్రైన్ మరియు సిసి రోడ్ల ఏర్పాటు,బీరప్ప గడ్డ రామాలయం ఎదురుగా, బీరప్ప ఆలయం ఎదురుగా, బీరప్ప గడ్డ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు కోసనం,పలు స్ట్రాం వాటర్ డ్రైన్ ల కు మరియు సిసి రోడ్లకు వెంటనే నిధులు కేటాయించాలని కోరారు.